క్లుప్తంగా

'20 రోజుల్లో పనులు పూర్తి'



పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ పుష్ప తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: బహుదా నదిపై కూలిన వంతెన స్థానంలో జరుగుతున్న ప్రత్యామ్నాయ ఏర్పాట్లు మరో 20 రోజుల్లో పూర్తయ్యే అవకాశాలు ఉన్నట్లు ఎంపీపీ బోర పుష్ప స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కేటాయించిన రూ.20 లక్షలతో వంతెన వద్ద జరుగుతున్న పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. భారీ వర్షాలు పడితే పనులు కొంతవరకు ఆలస్యం అవుతాయని, లేకుంటే పనులు శరవేగంగా జరుపుతున్నామని సదరు కాంట్రాక్టర్ ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఆమెతో పాటు రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావురెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, వీఆర్వో సంఘ అధ్యక్షుడు ఉప్పాడ రాజారెడ్డి, సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి,ఎ నాయకులు రాంపత్ని చిట్టిబాబు, రంగాల కృష్ణారెడ్డి, బాకి లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల వితరణ

మందస: మండలంలోని లోహరిబంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నర్తు శంకర్, పిన్నింటి యుగంధర్, గొరకల పాపారావుల ఆర్థిక సాయంతో వాటర్ బాటిళ్లను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి రాపాక శేషగిరిరావు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ అందాల అప్పారావు, హెచ్‌ఎం వై.అరుణశ్రీ, కొల్లి తేజేశ్వరరావు, అందాల వాసుదేవు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కవిటి: మండలంలోని బొరివంక ఉప విద్యుత్ కేంద్రం పరిధిలోని మాణిక్యపురం, బల్లిపుట్టుగ, వరక గ్రామాలకు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కవిటి ఇన్‌చార్జి ట్రాన్స్‌కో ఏఈ ఎం.నేతాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌కేఈ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగిస్తుండడంతో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

టెక్కలి: పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డీఈఈ ఎస్.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ టౌన్-1 మరియు 11 కేవీ టౌన్ -2 ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

'మహిళలు ఆర్థికంగా ఎదగాలి'

టెక్కలి: ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీలను ఉపయోగించుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ డీపీఎంఎస్ బి.నారాయణరావు ఆకాంక్షించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, మెషినరీ యూనిట్ల ఏర్పాటుపై మహిళా సంఘాలకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో అందజేస్తున్న వివిధ బ్యాంకు రుణాలపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంతిపథం ఏరియా కో-ఆర్డినేటర్ శ్రీరాములు, ఏపీఎం నారాయణరావు, డీపీఎం నాగలక్ష్మి, డీఆర్‌పీ సునీల్ పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

నందిగాం: మండలంలో పెద్దబాణాపురం సచివాలయ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డివిజినల్ లెవల్ పంచాయతీ ఆఫీసర్ ఐవీ రమణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో జరుగుతున్న చెత్త సేకరణ కార్యక్రమాన్ని, చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారీ, వాటి వినియోగాన్ని సచివాలయ కన్వీనర్ సంతోష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే చెత్తను వివిధ రకాలుగా విభజించుకోవడంపై సూచనలు అందజేశారు. అనంతరం మొక్కలు నాటారు. వారితో పాటు నాయకుడు పైల నారాయణరావు తదితరులు ఉనారు.

మహిళల ఆందోళన

కంచిలి: మండలంలో బొగాబెణి పంచాయతీ పరిధిలోని కొన్ని స్వయంశక్తి సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం డబ్బులు అందలేదని పలు సంఘాల మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామ సభలో ఈ మేరకు ఆయా మహిళా సంఘాల సభ్యులు అధికారులు, నేతల దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం ఈ పథకాలు అందిస్తున్నా, తమవరకు చేరడం లేదని వాపోయారు. ఈ విషయమై వైఎస్సార్ కేపీ ఏపీఎం పి.ఉమారాణి వివరణ ఇస్తూ ప్రభుత్వం ఇస్తున్న అన్ని పథకాలను నేరుగా సంఘాల అకౌంట్లలోనే జమ చేశామని స్పష్టం చేశారు. ఈ పంచాయతీకి మొత్తంగా రూ.33 లక్షలు వైఎస్సార్ ఆసరా పథకం డబ్బులు జమ చేసినట్లు వెల్లడించారు. సంఘాల తీర్మానాలు రాసుకొని, బ్యాంకులో విత్‌డ్రా చేసుకొంటే తీసుకోవచ్చని తెలిపారు. అయితే తాము బ్యాంకుకు వెళ్లి అకౌంట్లను చూస్తే ఖాతాల్లో ఆ డబ్బులు లేవని మహిళలు వాపోయారు. దీనిపై న్యాయం చేయాలని స్థానిక సర్పంచ్ గణప సింహాచలం తెలిపారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారించి, బాధ్యులపై చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డిలు తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా... చదువుల కోటగా

అదేమీ కార్పొరేట్ పాఠశాల కాదు.. అయితేనేం వసతుల్లో దేనికీ తీసిపోదు. కేవలం సాధారణ ప్రభుత్వ పాఠశాలే అయినప్పటికీ ఫలితాలతో సత్తా చాటుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ ఛాలెంజ్ విసురుతోంది. అందుకు ఇటీవల విడుదలైన ఐఐటీ ఫలితాలే ఉదాహరణగా చెప్పవచ్చు. ట్రిపుల్ ఐటీకి ఈ పాఠశాల నుంచి 14 మంది ఎంపికై అందరినీ ఆశ్చర్యపరిచారు. నెలరోజుల క్రితమే ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షలో పది మంది విద్యార్థులు సత్తా చాటారు. ఇలా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఒకసారి పరిశీలిస్తే...

- ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
- ఈ ఏడాది ట్రిపుల్ ఐటీకి 14 మంది ఎంపిక
- ఎన్‌ఎంఎంఎస్‌లో జిల్లాస్థాయి రికార్డు
- పది ఫలితాల్లో డివిజన్ స్థాయిలో ముందంజ



ఉపాధ్యాయుడు వెంకటరావును అభినందిస్తున్న హెచ్‌ఎం చిన్నంనాయుడు తదితరులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి కాశీబుగ్గ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1960 సంవత్సరములో నిర్మించారు. పాఠశాలలో ప్రస్తుతం ఆంగ్ల మాధ్యమం సైతం అమలు చేస్తున్నారు. ఇదే పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే వచ్చే ఏడాది ఇంటర్ తరగతులు ప్రారంభమవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 1,108 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయులు 33 మంది పనిచేస్తున్నారు.

ట్రిపుల్ జోష్

ఈ పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు ఈ ఏడాది ఐఐటీకి ఎంపికయ్యారు. గురువారం విడుదలైన ఐఐటీ ఫలితాల్లో బి.లహరి, పి.ప్రవల్లిక, ఎస్.లక్ష్మీకాంత్, కె.రేష్మ, ఎం.అమృత, జె.శ్రీదేష్, పి.హేమంత్, నీరజ్‌సాహు, వి.ప్రేమకుమార్, వి.వర్ష, అఖిలపండా, వి.భువనచరణ్, ఎ.శరత్, వై.రోజాలు విజేతలుగా నిలిచారు. వీరిలో నూజువీడు ట్రిపుల్ ఐటీకి 8 మంది, ఒంగోలుకి ఒకరు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి 5 మంది చొప్పున ఎంపికయ్యారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో సత్తా

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నటువంటి నిరుపేద విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్ష ఒక వరం. ప్రతి ఏడాది ఆర్థిక సాయం అందుతూ ఉన్నత చదువులకు ఉపయోగపడుతుంది. ఈ ఏడాది ఈ పాఠశాల నుంచి మొత్తం 10 మంది విద్యార్థులు అర్హత సాధించారు. వారిలో ఎస్.కార్తికేయ, ఎం.గాయత్రి, బి.లిఖిత, పవన్ కుమార్ పండా, వి.లహరి, ఎస్.నమ్రత, సప్ప విఖ్యాత్, చాయా కిరణ్, కొనపల వీణ, కణితి వెన్నెలలు ఉన్నారు. ఇవే కాకుండా గత మూడు సంవత్సరాలుగా వరుసగా ఏడు, ఎనిమిది, పది మంది ఈ పరీక్షలు అర్హత సాధించారు.

పది ఫలితాలలో డివిజన్ ఫస్ట్

ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో పాఠశాలకు చెందిన బైరి లహరి 588 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల డివిజన్ టాపర్‌గా నిలిచింది. పాఠశాలలో 260 మంది విద్యార్థులకు గాను 194 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 150 మంది ఫస్ట్‌క్లాస్ సాధించారు.



కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

నాడు-నేడుతో సకల సౌకర్యాలు

ఈ పాఠశాలలో సుమారు రూ.2.10 కోట్లతో నాడు-నేడు అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం ఇదే పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కొత్త భవనాలతో పాటుగా తాగునీటి ఆర్వో ప్లాంట్, ఇతర అన్ని నూతన సౌకర్యాలు అందిస్తున్నారు. క్రీడాపరంగా అనేక మంది విద్యార్థులను ప్రోత్సహిస్తుండడంతో వారు రాష్ట్రస్థాయిలో చక్కని బహుమతులు సాధించిపెడుతున్నారు. పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు దీటుగా నిలుస్తుండడతో ఇక్కడ అడ్మిషన్ దొరకడం కష్టంగా మారుతోంది.



విద్యార్థుల మార్కులతో సిద్ధం చేసిన కరపత్రం

ఉపాధ్యాయుల సహకారంతో విజయం



మా పాఠశాలకు జిల్లాలోనే ప్రత్యేక స్థానం ఇప్పుడు ఉంది. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా ప్రత్యేక తరగతులు చేపడుతున్నాము. అర్హత ఉన్నటువంటి విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తుంటాం. పాఠశాల విడిచిపెట్టిన అనంతరం రోజుకో ఉపాధ్యాయుడు శిక్షణలో పాల్గొంటారు. ఇటువంటి శిక్షణలో వెంకటరావు మాస్టారు పూర్తి బాధ్యతలు చేపడుతున్నారు.

– చిన్నంనాయుడు, హెచ్‌ఎం, కాశీబుగ్గ జెడ్పీహెచ్ స్కూల్

విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దుతాం



ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల కోసం విద్యార్థులకు ప్రత్యేకంగా కోచింగ్ ఇస్తాను. సిలబస్‌లో ఉండే ప్రతి విషయం వారికి వచ్చేవిధంగా వివరణాత్మకంగా బోధిస్తాను. బోధించిన విషయంపై ప్రతిరోజూ వారికి 10 ప్రశ్నలు బోర్డుపై రాసి టెస్ట్ పెడతాను. టెస్ట్ సమయం అయిన వెంటనే ఇచ్చిన 10 ప్రశ్నలను వివరిస్తాను. పరీక్ష అయ్యేవరకు స్కూల్ సెలవు దినాల్లో సైతం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు తరగతులు చెబుతాను. ఈవిధంగా పరీక్ష కోసం విద్యార్థులను సిద్ధం చేస్తాము.

– కిల్లి వెంకటరావు, ఉపాధ్యాయుడు, కాశీబుగ్గ జెడ్పీహెచ్ స్కూల్

పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పాలి

- వజ్రపుకొత్తూరులో వలంటీర్ల మానవహారం



పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వలంటీర్లు

వజ్రపుకొత్తూరు: తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద శనివారం మానవహారం నిర్వహించి మాట్లాడారు. కరోనా కష్టకాలంలో తాము ప్రాణాలకు తెగించి సేవలందిస్తే రాజకీయ స్వార్థం కోసం ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఉన్నతమైన వ్యవస్థలో పని చేస్తున్నందుకు గర్వపడుతున్నామని తెలియజేశారు. తాము మహిళల అక్రమ రవాణా చేస్తున్నామని చెప్పిన పవన్ కల్యాణ్‌కు నిబద్ధత ఉందా అని ప్రశ్నించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మకు వినతి పత్రం అందించారు. వలంటీర్లకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్య నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవరావు, దున్న బాలరాజు, గంగెట్ల గున్నమ్మ, కె.మల్లేశ్వరరావు, వి.కరుణాకర్, టి.వరదరాజు, టి.రాజారావు తదితరులు సంఘీభావం తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పోషణ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ గురుమూర్తి

ఇచ్ఛాపురం రూరల్: అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి అన్నారు. శనివారం ఆయన బూర్జపాడు అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ పోషణ కిట్లు అందజేశారు. బలవర్ధకమైన ఆహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. కార్యకర్త దున్న కనకమ్మ పాల్గొన్నారు.

అక్షయపాత్రకు నిధుల కోసం వినతి



టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

కంచిలి: శ్రీకాకుళం జిల్లాలోని వెనుకబడిన ప్రాంతమైన ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అక్షయపాత్ర ఫౌండేషన్ ఏజెన్సీ ఏర్పాటు కోసం రూ.9 లక్షల తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు మంజూరు చేయాల్సిందిగా టీడీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ కోరారు. ఈ మేరకు విశాఖపట్నంలో వై.వి.సుబ్బారెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలు, మున్సిపాలిటీలో చదువుతున్న పాఠశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు మంచి పోషకాహారం అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా అందించేందుకు గానూ కంచిలి మండలంలో ప్రభుత్వ స్థలాన్ని కలెక్టర్ సమకూర్చారని తెలిపారు. ఈ విషయమై వై.వి.సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారు.

జగనన్న సురక్ష.. పేదలకు రక్ష

ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో జగనన్న సురక్ష క్యాంపులు జోరుగా సాగుతున్నాయి. దీనిలో భాగంగా సాంకేతిక సమస్యలతో పథకాలు అందనివారి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నారు. కావాల్సిన ధ్రువపత్రాలను వెంటనే జారీ చేస్తున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



టెక్కలి: బొప్పాయిపురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న దువ్వాడ వాణి తదితరులు



కోటబొమ్మాళి: అక్కయ్యవలసలో ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకటరమణారావు తదితరులు



పలాస: లక్ష్మీపురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు



మందస: కొత్తపల్లిలో మాట్లాడుతున్న సర్పంచ్ సేనాపతి దివ్య



కంచిలి: పురుషోత్తపురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు



కంచిలి: బొగాబెణి మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి



ఇచ్ఛాపురం రూరల్: మండపల్లిలో ధ్రువపత్రాలతో మహిళలు



కాశీబుగ్గ: పూజారి వీధిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం



నందిగాం: కల్లాడలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీరామమూర్తి



సోంపేట: ఉప్పలాం సచివాలయంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

సంక్షిప్తంగా...

రేషన్ డిపోలో తనిఖీలు

కోటబొమ్మాళి: మండలంలోని నారాయణవలస రేషన్ డిపోను శ్రీకాకుళం విజిలెన్స్ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపోలో 400 కేజీల బియ్యం స్టాకు తక్కువగాను, అలాగే రేషన్ వాహనాన్ని తనిఖీ చేయగా 343 కిలోల బియ్యం తక్కువగాను ఉన్నట్లు గుర్తించిన అధికారులు రేషన్ డీలర్ పల్లి మాధవి, రేషన్ వాహనం ఆపరేటర్ నేతింటి లక్ష్మీనారాయణపై 6ఏ కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారులకు నివేదిదక అందించి తగు చర్యలు తీసుకోనున్నట్లు విజిలెన్సు అధికారి బి.సింహాచలం తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

సంతబొమ్మాళి: మండల కేంద్రానికి చెందిన లఖినాన ఏకబు అనే యువకుడు బ్రెయిన్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడడంతో సంతబొమ్మాళి యువజన సేవా సంఘం, సిక్కోలు సేవా సమితి సభ్యులు ఆర్థిక సాయం శనివారం అందజేశారు. సంతబొమ్మాళి యువజన సేవా సంఘం దాతల నుంచి సేకరించిన రూ.20,201లు, సిక్కోలు సేవా సమితి నుంచి సేకరించిన రూ.10,500లు మొత్తం కలిపి రూ.30,701లు ఆర్థిక మొత్తాన్ని బాధితుడికి అందించారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి యువజన సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బైక్ యాత్రికుడికి అభినందనలు

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించాలని కోరుతూ నెల్లూరు జిల్లాకి చెందిన అడవికొట్టు రాజు తన ద్విచక్ర వాహనం మీద నిర్వహిస్తున్న యాత్ర ఇచ్ఛాపురం పట్టణానికి శనివారం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనను సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, కౌన్సిలర్లు సుగ్గ ప్రేమ్‌కుమార్, బచ్చు జగన్నాథం, వైఎస్సార్ సీపీ నాయకులు పరపటికోటి రెడ్డి, టింక లోకేశ్‌లు కలిసి అభినందనలు తెలియజేశారు.

కేన్సర్ రోగికి ఆర్థిక సాయం

కంచిలి: మఠం సరియాపల్లి గ్రామానికి చెందిన గిన్ని యోగేష్ కుమార్తె గిన్ని నైమిశ కేన్సర్‌తో బాధపడుతోంది. పేద కుటుంబానికి చెందిన వీరు పాప చికిత్సకు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కర్తలి గ్రామానికి చెందిన యువకులు రూ.56,200లు మొత్తాన్ని విరాళాలుగా సేకరించి యోగేష్‌కు శనివారం అందజేశారు.

స్థలం మంజూరుకు ఆదేశాలు

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపేట సచివాలయం పరిధిలో ముస్లిం కుటుంబాలు అధికంగా నివాసముంటున్నారు. వీరికి షాదీఖానా, శ్మశానవాటిక నిర్మాణాలకు స్థలాలు మంజూరు చేయాలని మండల కో-ఆప్షన్ సభ్యుడు రంజాన్ రాజూభాయ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మూలపేట పోర్టు శంకుస్థాపన సమయంలో వినతిపత్రం అందజేశారు. దీంతో స్థలాలు మంజూరు చేస్తూ సీఎం కార్యాలయం నుంచి శుక్రవారం ఆదేశాలు వచ్చాయి. ఆ ఉత్తర్వు కాపీలను శనివారం స్థానిక తహసీల్దార్ జామి ఈశ్వరమ్మకు సర్పంచ్ రాంపాత్రుని సావిత్రి, ఎంపీటీసీ డి.రామకృష్ణ, ముస్లిం సంఘ ప్రతినిధులు అందజేశారు.

అరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

వజ్రపుకొత్తూరు రూరల్: చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కనిష్క అన్నారు. మండలంలోని నువ్వలరేవు(లక్ష్మీదేవిపేట) ప్రాథమిక పాఠశాలలో శనివారం చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. అలాగే టీకాలు వేశారు. కార్యక్రమంలో నాయకుడు యర్రా పాల్గొన్నారు.